
## నవ్య వీక్లి - పసుపులేటి లక్ష్మినారాయణ స్మృతిసాహితి కథల పోటీలో

# రూ. 2,500 తృతీయ బహుమతి పొందిన కథ

ఇరవై ఏళ్లయింది.
ఈ మట్టిని వదిలి. మనుషులని వదిలి. వాళ్ళ మనసులని వదిలి. వెక్కిళ్ళని బిగపట్టుకు కూర్చున్నట్లుంది నా పరిస్థితి. మా ఊరు నాకు అంటరానిదయింది. ఎందుకో అలా చేసుకున్నాను.
నయాగరా జలపాతంలో తడిసినప్పుడు ఇంత చల్లదనం నా శరీరానికి తగిలిందేమో కానీ గుండెకి లేదు. నేను ప్రేమిస్తున్నాను. నన్ను నేను ప్రేమించుకుంటున్నాను. ప్రేమని పంచుకోవాలనుకుంటున్నాను.

# పసుపునీళ్ళ వాన

## షేక్ ఖాదర్ షరీఫ్



ఇప్పుడు నా మూలాలు నాక్కావాలి. నా స్వరూపం నాక్కావాలి. నా మూలాధార చక్రం మీద నేను తిరగాలి.

వేకువ జామున నదిలో పడిపోయిన సూర్యుడిని లేవదీసి ఆకాశం నుదటి మీద అతికించాలి.

బిడ్డ వచ్చాడని కళ్లని తడి చేసుకున్నట్లుంది ఊరు. నరసింహస్వామి ఆశ్రమం దాటి వేగంగా కదుల్తోంది పెన్నా నది ఒడ్డున మేము ప్రయాణిస్తున్న కారు.

''ఇంకా ఎంత దూరం నాన్నా'' నదికేసి చూస్తూ అంది ''సింద్రిల్లా''

''సింద్రీ....డోర్ క్లోజ్ చేం ...'' ప్రేమగా అంది నా భార్య.

''ఉండనీ మమ్మీ...రెయిన్ హాయిగా ఉంది. ఇండియన్ రెయిన్ కదా ఎలా ఉంటుందో చూద్దాం...'' సింద్రిల్లా తన తెల్లటి చేతుల్ని బయటపెట్టి వర్షంతో కరచాలనం చేస్తూ ఉంది.

పెన్నానది ఒడ్డున ఉండే శివాలయం ముందు ఆపాను కారుని. అక్కడ ఇంకా వర్షం మొదలవలేదు. చినుకులు మాత్రం మమ్మల్ని అభిషేకించడానికి సిద్ధమవుతున్నాయి. గుడి ముందున్న మర్రి చెట్టు ఒడిలోకి చేరగానే ఊడలన్నీ ఊపి నన్ను పలుకరించింది. అందరం గుడిలోకి నడిచాం. మనిషే దేవుడి విషయంలో ఒక్కో సందర్భంలో ఒక్కో రకంగా ప్రవర్తిస్తూ ఉంటాడు.

''టెంపుల్ అద్భుతంగా ఉంది. నువ్వు అప్పుడప్పుడు చెప్తుంటావే ఇదేనా నాన్నా....'' రాతి గోడల్ని స్పర్శిస్తూ అంది 'రెయినీ'

గుళ్లో నుంచి నేను సరాసరి నది ఒడ్డుకి నడిచాను. ఎన్నో యుగాల నుంచి మనుషులకి జోలపాట పాడిన తల్లి నది. నేను ఒడిలో కూర్చున్నాక మురిసిపోయింది.

తన స్పర్శతో మరలా నన్ను సజీవుడిని చేసింది. అవును నేను మనిషిగా చనిపోయి చాలా ఏళ్లే అయింది. చాలా కాలానికి నాలో ఇప్పుడు ప్రశాంతత. ఒడ్డున నడుస్తుంటే ఎవరో గట్టిగా నన్ను పిలుస్తున్నారు. బహుశా నా భార్య కావచ్చు. అవును తల్లి నుంచి బిడ్డని వేరు చేసేది భార్యలే. క్షమించాలి.

పెన్నమ్మ తల్లి నా ముఖాన ఇన్ని నీళ్లు చల్లి నన్ను ముద్దులు పెట్టి పంపింది. అందరం కారు దగ్గరకి చేరుకున్నాక, పూజారి గారు వచ్చారు.

''మిమ్మల్ని ఎప్పుడూ చూడలేదు. మీరూ...'' అన్నాడు ఆశ్చర్యంగా నా వైపు చూసి.

''నేను ఈ ఊరి వాడినే నండి. నా పేరు పామర్తి రమణ. పామర్తి నరసయ్య కొడుకుని....'' అలా చెప్తున్నప్పుడు ఎందుకో నా మనసు నిండా గాయాలే.

ఊరిలోకి ప్రవేశిస్తుంటే స్టీరింగ్ మీదున్న నా చేతులు సన్నగా వణికాయి. కళ్లు తెరచినప్పటి నుంచీ కన్నీళ్ళే నింపుకుని ఎదురు చూస్తున్న నా ఇంటికి వెళ్తున్నాను. ఇరవై ఏళ్ళ తరువాత.

ఒక్కో నిమిషం గడిచే కొద్దీ ఒక్కో నరం తెగుతూ ఉంది. ''గుర్తు పడ్తారా...'' ఎటో చూస్తూ లో గొంతుతో అంది నా భార్య.

''ఆ....'' అన్నాను. కళ్ళూ మనసూ పడ్తున్న పోటీని ఆపుకుంటూ.

బస్టాండు, మసీదు...పీర్లసావిడి వీధి

దాటాక ఊరికి దూరంగా వచ్చేసరికి ఎక్సలేటర్ మీద నుంచి కాలు తప్పించాను. ఒక చిన్న మలుపు... నేరుగా పోనిస్తే పెద్ద వేపచెట్టు. దాని చుట్టూ కట్టిన ఎత్తయిన అరుగు. నాకు తెలుసు ఆకాశమంత ఎత్తయిన ఈ అరుగు మీదనే నేను నా ఆత్మని పాతిపెట్టుకున్నది.

బండి ఆగిపోయింది.

జ్ఞాపకాలు ఎప్పటికీ మాసిపోయేవి కావు. నా ఆశల ఉయ్యాలనిఊగడానికి అరుగు ఎక్కాను. నా కాళ్ళని పట్టి పీడిస్తున్న ఖరీదయిన బూట్లని కిందనే విసిరికొట్టి అరుగునెక్కి చుట్టూ తిరుగుతుంటే...కింద నుంచి నా కూతుళ్ళు నవ్వుతూ నన్ను వీడియోలో బంధిస్తున్నారు.


ఆ వేపచెట్టుకి కట్టిన ఎన్నో దారాల్లో నేనూ ఒక దారంలా అల్లుకు పోయాను ప్రేమగా. నా శరీరంలోని ప్రతి కణం కళ్ళు విప్పుకుంటూ ఉంది. నా గుండెల్లోని ప్రతీ జ్ఞాపకం గూడు విడిచి స్వేచ్ఛగా ఎగురుతూ ఉంది. విడిచి పెట్టిన పాపానికి అరుగునంతా కన్నీళ్ళతో కడిగాను. నా చర్మం కిందున్న అవయవాలన్నింటినీ ఆ చెట్టుకి నైవేద్యంగా పెట్టుకున్నాను. సందేహం లేదు. అప్పుడు నేను బతికిపోయాను. నా ఆత్మ భద్రంగా ఉంది.

''ఇంక చాల్లేరా...దిగు...ఎవరయినా పిచ్చి పట్టిందనుకుంటారు...''

ఆ మాటల్తో ఈ లోకంలోకి వచ్చా. నేల మీద పడున్న చరిత్ర పుస్తకంలా ఉన్న నా రత్తిగాడు.

వాడు నా చిన్నప్పటి సావాసగాడు. వాడే. రత్తయ్యే! నా దోస్త్. నా ఫ్రెండ్. వాడు చేయందిస్తే అరుగు మీద నుంచి నేల మీద పడి వాణ్ణి కౌగిలించుకున్నాను. మా చుట్టూ జనం. ఇంకా ఇళ్ళలోంచి చాలా మంది అరుగు చుట్టూ చేరిపోయారు.

వెన్నముద్దల్లాంటి దేహాల్తో దేవతల్లాగా నిలబడ్డ నా భార్యా పిల్లల్ని...ఆశ్చర్యంగా చూస్తున్నారు.



''ఏంద్రా అట్ట జూస్తా ఉండారా..మన పామర్తోడ్రా....రవణడు...రవిణిగాడు...'' అన్నాడు రత్తయ్య. నన్ను ఒక్కోసారి ఒక్కో విధంగా పలుకుతూ వాడలా అంటూ ఉంటే కళ్ళలోంచి ఒక్కో కన్నీటి చుక్క రాలిపోతూ ఉంది.

యాపచెట్టు వెనక ఇల్లే మాది. కానీ పూర్వమున్న గుడిసె లేదు. మిద్దె. దాని పక్కనే అలాంటి మిద్దే మరొకటి. బహుశా అది అన్నయ్యది అయి ఉంటుంది. నాకు తెలియకుండానే అడుగులు ఇంటి వైపు పడ్డాయి. వాకిట్లోనే ఎదురుగా మా నాయన. మంచానికి అడ్డంగా కూర్చుని.

నా వైపు చూడను కూడా చూళ్ళేదు. నా చెల్లెలు, వదిన, అక్క, బావ అందరూ అందరూ బయటకొచ్చి చూస్తున్నారు గానీ ఎవ్వరూ దగ్గరకి రాలేదు. వస్తున్న దుఃఖాన్ని ఇంక ఆపుకోలేం అన్నట్లు ఉంది ఆడవాళ్ళ పరిస్థితి. కొంగుల్ని నోటికి అడ్డం పెట్టుకొని నిలబడ్డారు.

మా నాయన ఒక్క క్షణం నా వైపు జూసి తలతిప్పుకున్నాడు. నన్నెవరూ క్షమించరు. నేనెలాంటి వాడినంటే...అమ్మ రొమ్ముతో అవసరం తీరిపోయాక ఆ రుణాన్ని తెంచి వెళ్ళిపోయిన కసాయివాడిని.

మా నాయన కాళ్ళ పైన పడ్డాను. ఆ మట్టి కాళ్ళని ముద్దాడుకున్నాను. కన్నీళ్ళతో అభిషేకించుకున్నాను. మా నాయన కరిగిపోయాడు. శరీరం మొత్తం వణకడం మొదలు పెట్టింది. ఆయన శక్తినంతా కూడదీసుకొని నన్ను లేవదీశాడు.

నాయన నన్ను తన గుండెకెత్తుకున్నాడు.

అంతే....అంతా జాతరలాగా ఏడ్చారు.

నా కోటూ సూటూ, బూటూ కన్నీళ్ళలో కాలిపోయాయి. నేనిప్పుడు రాములమ్మ కొడుకుని. పామర్తి రవణయ్యని....రవిణిగాడిని. నిజం చెప్పాలంటే... నేను మాదిగ రవిణిగాడిని.

''పామర్తోడు వచ్చినడంటమే..అమెరికా నించి పెళ్లాం పిలకాయల్ని యెంటేస్కునొచ్చిండంట....'' వాడ వాడంతా ఇదే చర్చ.

ఆరాత్రి నా ఇంటి గుండె డప్పు మోగింది.

నేను ఊరికీ, ఇంటికి సమాధానాలు చెప్పడానికి నాలుగు రోజులు పట్టింది.

సత్యాలోళ్ళ చేనులో నేనూ రత్తిగాడు, ఖాదరు, పున్నిగాడు అందరం కల్సుకున్నాం. నాతో పాటు అమెరికా నుంచి తెచ్చిన 'జానీవాకర్'ని అందరికీ పరిచయం చేశా.

చుట్టూ మంచాలు వేస్కుని కూర్చుంటే జానీ వాకర్ కరుగుతూ నవ్వుతున్నాడు.

''ఎన్ని బాటిళ్ళు తెచ్చావ్‌రా'' అన్నాడు ఖాదరు.

''ఏరా చాలదనా?...ఇంకో సంవత్సరం మొత్తం తాగినా తరగనంత తెచ్చా. ''

''ఒరే రవణా...మనం పదోక్లాసులో చర్చి దగ్గరుండే తోటలో కల్లు తాగేవాళ్ళం గుర్తుందా?'' అన్నాడు ఖాదరు జానీని ప్రేమగా కడుపులో దాచుకుంటూ.

''అవున్రా కల్లుగీసే గవళ్ళోళ్ళ మస్తాను ఎట్టుండ్రా....''

''ఇప్పుడెవురూ చెట్లు గీయడం లేదు మావా!.... మస్తాను గూడా కరెంటు సామాన్ల అంగడి పెట్టుకుని జల్సాగా ఉండాడు. వోడికి పెళ్ళయి ముగ్గురు పిలకాయలు...''

''అసలిప్పుడు ఎవురూ కులవృత్తి చెయ్యడంలే ద్రా'' పున్నిగాడు మాట్లాడుతూనే మరలా అందరి గ్లాసుల్లో జానీని నింపాడు.

''ఏం'' ఆలోచిస్తూ సిగరెట్ అంటించాను.

''కాలంతో వచ్చిన మార్పులు బావా. అంతెందుకు మన మాదిగోళ్ళలోనే అందరూ మానుకున్నారు. నూ యెళ్ళిపోయినాక మీ నాయనే అంగడి ఎత్తేసినోడు. మళ్ళా మీ అన్న బ్యాంకులో లోనే తెచ్చి బస్టాండ్ కాడ అంగడి పెట్టాడు. నాలుగు నెలల్లో ఎత్తేశాడు....'' రత్తిగాడు మంచం మీదనుంచి లేచి ఒళ్ళు విర్చుకుని ఆకాశం కేసి చూస్తా అన్నాడు.

''ఎందువల్ల...''

''ఎందుకేందిరా జరక్క. అందరి పరిస్థితీ అంతే. జీవనం జరక్క కుటుంబాలకి కుటుంబాలు బతుకుదెరువు కోసం టవున్లకీ సిటీలకీ యెళ్ళిపోయినయి. మన నారాయణ గూడా బెంగుళూరు యెళ్ళిపోయిండు. అక్కడ గూడా కులవృత్తి కూడుబెట్టలా వాడికి. కొంత మందయితే రిక్షా లాగారు. ఆటో నడిపి బతుకీడస్తా ఉండారు. హోటళ్ళలో పనికి కుదిరి పొట్టపోసుకుంటా ఉండారు...'' రత్తిగాడు బతుకు పుస్తకం తెరిచాడు.

''అయితే మనోళ్ళంతా మనపని మానేసినట్టేనా....''

''అవును బావా మనోళ్లు రోజు రోజుకీ వస్తున్న మార్పులకి తట్టుకోలేక పోయారు. ప్రైవేట్ ఫ్యాక్టరీలు వచ్చిపడ్డాయి. దాంతో మన కులవృత్తికి పూర్తిగా ఆదరణ పడిపోయింది. వాళ్ళేమో కోట్లకి కోట్లు కుమ్మరించి పెట్టి జిగేల్‌మనిపించే ఏసీ షోరూముల, మెత్తాటి కుషన్ సీట్లు ఏర్పాటు చేసి కొనేవాళ్ళని ఆకర్షిస్తా ఉండిరి ఇకన మనోళ్ళు యాడ తట్టుకుంటారు.....''

# మిత్రుడి కలకు అక్షర రూపం



ఆంధ్రప్రదేశ్ నీటి పారుదల శాఖలో ఉద్యోగం చేస్తున్నాను. మంచి సాహిత్యం కోసం చిన్నప్పటినుంచే వెతికే వాడిని. పట్టుమని పది కథలు కూడా రాయలేదు. కవిత్వమంటే ప్రాణం. అదేనన్ను దుఃఖంలో ఓదార్చేది.

ఈ కథ నా మిత్రుడు పామర్తి రమణయ్య కల. ఆ కలకి అక్షర రూపమే ఈ కథ. ముందుగా దాన్ని కరపత్రంగా చేసి అందరి అభిప్రాయాన్ని సేకరిద్దాం అనుకున్నాం. కానీ కథగా ఎందుకు మలచకూడదు అనుకున్నా. కథగా రాశా. ఆలోచన మంచిదా కాదా అనేది పాఠకులే చెప్పాలి.

కథకి బహుమతినిచ్చి నన్ను ప్రోత్సహించిన నవ్యకి నేను ఎప్పుడూ ఋణపడి వుంటాను.... ఈ కథ నిజమైన కథ.

కలని నిజం చేసే ప్రయత్నంలో ఎప్పుడూ ప్రవహిస్తూ ఉంటాను.


**-ఖాదర్ షరీఫ్ షేక్**

**క్వార్టర్ నెం. ఎ/62, సోమశిల ప్రాజెక్ట్,**
**సోమశిల - 524 301**
**నెల్లూరు జిల్లా**
**ఫోన్: 94419 38140**


ఆ రాత్రంతా ఎంత తాగామో తెలీదు. రత్తిగాడు ఎన్నో మార్పుల గురించి చెప్పాడు.

నిజమే ఈ కంప్యూటర్ యుగంలో కాళ్ళకి ధరించే చెప్పులు కూడా వివిధ రకాల మెటీరియల్స్‌తో ఆకర్షణీయమైన రంగుల్లో దొరుకుతున్నాయి. దాంతో సాదాసీదా చెప్పుల కన్నా మంచి మోడల్స్ పైనే వినియోగదారులు మొగ్గు చూపుతున్నారు. కారణం తయారు చేసే వస్తువులకి కనీస ధర కూడా లభించడం లేదు. దాంతో ఎక్కువ మంది ఈ వృత్తితో జీవనం సాగించలేకపోతున్నారు. యంత్రాలతో తయారు చేసే షోరూమ్‌లు ఏర్పాటు చేసుకునే స్థోమత లేక రోడ్డు మార్జిన్ లోనే భార్యాబిడ్డలతో చిరిగిన, తెగిపోయిన చెప్పులు, హ్యాండ్ బ్యాగులకు అతుకులేస్తూ బతుకీడుస్తున్నారు.

సొంత ఇల్లు కూడా లేక చాలీ చాలని తిండితో దుర్భర జీవితాన్ని అనుభవిస్తున్నారు. ఇప్పుడు కుల వృత్తిని నమ్ముకున్న వాడికి కన్నీళ్ళు తప్ప మరింకేం మిగలడం లేదన్నది సత్యం.

అంతరిస్తున్న కులవృత్తి పల్లెల్ని వదిలి పట్టణాలకి వలసపోయి అక్కడా నిలబడలేక పూర్తిగా కనుమరుగవుతూ ఉంది. చేతినిండా పనిలేక పోతున్నది. ఒక్క చర్మకారులే కాదు. ప్రతి కులవృత్తి చేస్తున్నవాడూ అనుభవిస్తున్నాడు. సమస్యని ఎదిరించలేక అసహాయతతో చతికిలబడుతూనే ఉన్నాడు. చేయూతనివ్వడానికి ఇప్పుడు ఏ చేయీ చలనాన్ని కల్గిలేదు.

ఒకప్పుడు మా నాయన 'బొక్కెన' చేయడంలో మొనగాడు. అది చేయడం అటుంచితే దాన్ని ఎయ్యడమే నరకం. పొలాల్లో దిగుడు బావులు ఉండేవి. అవి పొలానికి సమాంతరంగా ఉంటాయి. పై అంచు వరకు నీళ్లు ఊరి బావి వెనకే బారెడు గుంట ఉండేది. బాయిలో నీళ్ళు బొక్కెనసాయంతో బారెడు గుంటలోకి పోస్తే అవి పొలానికి చేర్తాయి. ఇదంతా ఇద్దరు మనుషులు బొక్కెనని తాళ్ళతో బిగించి కట్టి చెరో పక్కన పట్టుకొని నీళ్లు చేదిపోయాలి. అదంత సులువయిన పని కాదు. రెక్కలు ముక్కలయిపోతాయి. బొక్కెన కూడా తోలుతో తయారయ్యే వస్తువే. మనం ఒక ఆకుని తీస్కుని 'గరాట'లాగా మడిస్తేఎలా ఉంటుందో అలా ఉంటుంది బొక్కెన.

రాత్రయింది. చాలా మంది అరుగు దగ్గర కూర్చుని మాట్లాడుకుంటూ ఉన్నారు. 'సింద్రిల్లా' మేడ మీద పచార్లు చేస్తూంది. అన్నా, వదిన భోజనాలకి సిద్ధమయ్యారు. మా నాయన మంచం మీదనే కూర్చుని అన్నం తింటా ఉండాడు. ఆయనకి అది అలవాటు.

''సంగటి చెయ్‌లా...'' పళ్ళెంలో అన్నం పెడ్తున్న వదిన వంక కోపంగా చూశాడు అన్న.

''వోళ్ళు వచ్చుంటే..సంగటి యెట్టా జేస్తాం. అందరం మసూరా బియ్యమే తింటా ఉండాం'' చిన్నంగ నసిగింది వదిన. మేం వింటాం అన్నట్టు.

నేను చిన్నప్పటి నుంచి అన్నతో పెద్దగా మాట్లాడేవాడిని కాదు. అలాగని ప్రేమ లేదని గాదు. ఏంటో అలా జరిగిపోతా ఉండేది. అన్న అరుగు మీద ఒక వైపు కూర్చోనుంటే నేనూ వెళ్ళి కూర్చున్నా.

''మనోళ్ళు చానా మంది పనిమానేసినట్టుండారు గదన్నా....'' మాట్లాడే ప్రయత్నం మొదలు పెట్టాన్నేను. అటు నుంచి చాలా సేపు మౌనం.

''మానేయక యేం జాస్తారా. గిట్టడంల్యా. మూడొందలు ఉండే చర్మం ఇయాల మూడు నాలుగు వేలు పలకతా ఉండాది. వస్తువు జేస్తే కూలి గూడా గిట్టంల్యా. అన్నీ రేట్లు పెరిగి పోయినయి.

చెప్పులు పడిపోయినయి. గంటపట్టెడ్లు, తలతాళ్ళూ. బొడ్డువార్లు ఇయన్నీ చేయించుకునే రైతే లేడు. వాడేవోడు కరువయిపోతే ఇకన మాదిగోడికి పనెక్కడిది.

నీకో ఇషయం జెప్పేనా... దేవుడికి గూడా చెప్పులు కుట్టేవోడు లేడు. పది సంవత్సరాల నించి గుడికి గూడా మాదిగవాడ నుంచి చెప్పుల సాంగ్యం బోవడంల్యా...'' నేను వింటున్నానో లేదో పట్టించుకునే స్థితిని దాటి పూర్తిగా తనని తాను నడిపించుకునే ప్రయత్నాన్ని అన్న కొనసాగిస్తున్నాడు.

''నీ సదువుకని ఉన్నదంతా తగలేసిండు నాయిన. ఎట్నో ఆ మాన్యం ఉండబట్టీ అంగడి అమ్మేసి మాన్యం జేస్కుంటా బయటపడ్డాం. మనోళ్ళలో కొంతమంది పరిస్థితి మహా ఘోరంగా తయారయింది.

మనూరికి పెదమాదిగోడు నాయిన. ఆయనే పని గిట్టుబాటుకాక చేతులెత్తేసినాడు. ఇంక చేతబట్టుకుని ఊరేగేవోళ్ళు ఎవరుండారు చెప్పు...'' అన్న గట్టిగా బీడీదమ్ము లాగి ఆకాశం కేసి జూస్తా ఉండాడు.

''అయినా జనాలకి పనితనం గూడా నచ్చడంల్యా చిన్నోడా. కొత్త కొత్త మోడల్సు, రంగులు బజార్లని ముంచేస్తా ఉండాయి. ఒకప్పుడు పశువుల కాణ్ణించి మనసల దాకా మాదిగోడులేందే పని జరిగేది గాదు.

ఎవురిళ్ళలోనయినా పశువో గిసువో సచ్చిందనుకో ఎవరూ మాదిగోడిని పిలవడమేల్యా. మునిసిపాలిటీ వోళ్ళకి ఒక్క ఫోను గొడితే సాలు. బండేస్కుని వచ్చి మనిసయినా పశువయినా ఒకే తొట్టిలో తీస్కబోయి పారేస్తా ఉండారు..'' ఎటో చెప్పుకు పోతా ఉండాడు అన్న. పదునెక్కుతా ఉంది మనసూ మెదడూ రెండూ.

మరుసటి రోజు నేనూ రత్తిగాడు నది ఒడ్డునే నడుస్తున్నాం.

''ఎక్కడయినా మనూర్లో పదెకరాల స్థలం జూడు రత్తయ్యా...'' ఆశ్చర్యంగా జూశాడు నావైపు రత్తయ్య.

''ఎందుకు....''

''పనుంది. పని మొదలు పెట్టాలి...'' ఆకాశపు బురదలోంచి స్వచ్ఛంగా నిగనిగ లాడుతూ బయట పడ్తున్న సూర్యుడిని చూస్తున్నాను నేను.

''అంటే నువ్విక్కడే ఉండి పోతావా? ఇంక అమెరికా వెళ్ళవా. మీ ఆడోళ్ళు ఒప్పుకుంటార్రే...'' ప్రశ్నల మీద ప్రశ్నలకి వాడికి మౌనమే సమాధానం దొరికింది.

''స్థలమేమో ఉంది. పదెకరాల పైన ఇస్తారు గూడా. నీకెంత గావాల...''

''ఎంతయినా సరిపోద్ది మాట్లాడు...''

అనుకున్నట్టుగానే రత్తిగాడు చూపించిన నేల నచ్చింది. గుప్పెడు మట్టిని తీసుకుని గట్టిగా వాసన పీల్చాను. అంతర్గతంగా ఎక్కడో కన్నీటి శకలాలు కదలాడుతున్న స్పర్శ.

''స్థలం గల్ల రెడ్డిది బుచ్చిరెడ్డిపాళెంరా. మాట్లాడినాను. నీకూ నచ్చింది అంటున్నావ్ గదా రేపు బోయి మాట్లాడదాం''.

''లేదు ఇప్పుడే బయలు దేరదాం...''

నేనూ రత్తయ్య బయలుదేరాం. దార్లో చానా ఊర్లు చూశా. ఎక్కడా ఎద్దలబళ్ళే కన్పించలా. అక్కడక్కడా ఒకటీ రెండూ కన్పించినా సొగసుగా లేవు. మనుషులే అనుకున్నా జీవాలు కూడా జీవలక్షణాన్ని కోల్పోతూ ఉన్నాయి.

మాట్లాడుకోవటం పూర్తయ్యాక నాలుగు రోజుల తర్వాత రిజిస్ట్రేషన్ అనుకున్నాం. సగం డబ్బులు అప్పుడే కట్టేశాను. డాక్యుమెంట్లు తీస్కుని బయలు దేరుతుంటే రత్తయ్య ఎవరికో ఫోన్ చేశాడు.

''ఎవరికిరా ఫోను...''

''మన హుసేనుగాడు ఇక్కడే ఉండేది. నిన్ను అప్పుడప్పుడూ అడగతా ఉంటాడు. పద కలుద్దాం..'' అన్నాడు.

బుచ్చిరెడ్డిపాళెం ఊర్లోంచి మెయిన్‌బజారు చేరే సరికి విపరీతమయిన రద్దీ. ఎక్కడ చూసినా అంగళ్ళే. రత్తయ్య చెప్పిన చోట కారు ఆపి దిగాం.

''డైమండ్ ఫుట్‌వేర్...'' అందమయిన అక్షరాల్తో బోర్డు.

బాగా ఆధునీకరించిన చెప్పుల అంగడి.

షాపు మొత్తం ఎంతో అందంగా ఉంది. అక్కడ

క్కడా మంచి మంచి డిజైన్ల చెప్పులు తొడుక్కున్న అందమైన బొమ్మలు ల్యామినేషన్ చేసి తగిలించి ఉన్నాయి. రకరకాల కంపెనీల స్టిక్కర్లు. చెప్పుల్ని అందంగా వరుసక్రమంలో పేర్చి వాటికింద పెద్ద పెద్ద అక్షరాల్లో ధరల్ని వేసున్నారు.

కూర్చుంటే కాసేపయినా చాలు అన్పించే విధంగా సీట్లు. ధృడమయిన తెల్లటిదేహంతో నల్లటి గడ్డాన్ని అతికించుకున్నాడేమో అన్పించే విధంగా ఉండే వ్యక్తి ఒక స్త్రీకి చెప్పులు తొడుగుతున్నాడు.

''సలాం లేకుమ్ మామూ'' అన్నాడు రత్తయ్య వచ్చీరాని ఉర్దూ ఉపయోగిస్తూ.

''వాలేకుం సలామ్...'' మా వైపు చూసి నవ్వుతూ పక్క వ్యక్తికి పని పురమాయించి మాకు దగ్గరగా వచ్చి నిలబడ్డాడు అతను. నేను పోల్చుకోలేక పోయా. నా పరిస్థితిని గమనించి రత్తయ్యే పరిచయం చేశాడు.

''మన హుసేనుగాడ్రా. పీర్ల సావిడికాడ ఇల్లు. వీడిదే ఈ అంగడి.''

నోట మాట రాలేదు నాకు. యాంత్రికంగా కర చాలనం చేసి ఏం మాట్లాడాలో అర్థం కాక రాయిలా అయిపోయాను.

''ఎట్లుండావ్ రమణ్...'' వాడి మాటలు హుందాగా ఉండాయి. దుస్తుల నుంచి ఖరీదయిన సెంటు వాసన.

''అరే యజ్దానీ తీన్‌చాయ్... మలాయ్ దాల్కే లే ఆవ్...'' అన్నాడు పని చేసే కుర్రాడితో.

''బావున్నాను హుసేన్. ఎంతకాలమయింది అంగడిపెట్టి...'' నేనింకా ఆశ్చర్యంలోనే ఉన్నా.

''ఇరవై ఏళ్ళయింది రమణ్. నిన్ను అప్పుడప్పుడు అడుగుతుంటాన్నేను. చిన్నప్పుడు మీ నాన్న చెప్పులు కుడ్తాడని ఎగతాళి చేసేవాడిని. ఇప్పుడు నేను చెప్పులు అమ్ముకునే వాడినయినా.

నెల్లూరులో కూడా మనకు ఒక షోరూం ఉంది. కడపలో ఒక షోరూం. అల్లా దయవల్ల జబర్‌దస్త్‌గా జరుగుతూ ఉంది...'' హుసేన్ మరలా లోపలి కెళ్ళాడు. ఇందాకటి స్త్రీ వద్దకే వెళ్ళి మరొక అందమయిన జతని తొడుగుతున్నాడు.

కాలం మారిందో లోకం మారిందో తెలియదు గానీ ఇక్కడ మాత్రం నా కళ్ళ ముందు హుసేను ఒక్కడే మారిపోయాడు.

చెప్పులు అమ్ముకుంటున్నాడు. ఎంతో హుందాగా.

అక్కడ మా వాళ్ళంతా మాదిగ పుట్టుక పుట్టి మట్టి తిని బతకతా ఉంటే... ఇక్కడ ఈ సాయిబు చెప్పు లమ్మి బిర్యానీ తింటున్నాడు.

ఇంతకు ముందు ఇళ్ళల్లో ఉండే స్త్రీలకి చెప్పులు కుట్టాలంటే వాళ్ళ కాలి కొలతని పుల్లతో కొలిచి మాది గోడి దగ్గరకు తెచ్చేవాళ్ళు. అప్పటికప్పుడు చెప్పులు దొరకటం కష్టం. పెళ్ళిళ్ళకీ, కార్యాలకీ, చెప్పులు కావల్సి వచ్చినప్పుడూ అంతే. కాలి కొలతని తీసుకున్నాక వారం దినాలకి చెప్పులు కుట్టుకుని వాటిని కొత్త వెదురు గంపలో పెట్టుకుని దానిమీద తెల్లటి వస్త్రాన్ని కప్పి డప్పులు వాయించుకుంటూ సాంగ్యం బయలుదేరేది.

అక్కడికి వెళ్ళిన తర్వాత బుట్టని కిందకి దించి బుట్టమీది వస్త్రాన్ని కిందపరిస్తే దానిమీద ధాన్యం కుమ్మరించి ఆకూ వక్క పెట్టి... ఆ ధాన్యం మీద చెప్పులు తొడగాల్సిన కాలిని ఉంచినప్పుడు కుట్టిన వ్యక్తి తొడిగేవాడు.

వస్త్రంలో ఉంచిన ధాన్యాన్ని, దక్షిణని మరలా అదే బుట్టలో పెట్టుకుని మరలా డప్పులు వాయిస్తూ వెను తిరిగే వాళ్ళు. అంత హంగామా ఉండేది.

ఇప్పుడంతా కరువయింది. సమాజంలో చెప్పులు కుట్టేవాడి ఆవశ్యకతని గుర్తించి ఆదరించే వాళ్ళు. నేడు ఆ ఆదరణ లేదు.

''ఇప్పుడు ఒక పనిని ఫలానా కులం వాళ్ళే చేయాలనే సిద్ధాంతం పోయింది రమణ్. టవున్లలో చెప్పుల షోరూంలన్నీ సాయిబులవీ, రెడ్లవే. ఇదొక గొప్ప వ్యాపారం. లాభాలు కూడా బాగానే ఉన్నాయి...'' హుసేన్ ఇంకా చెప్పుకు పోతూనే ఉన్నాడు.

షోరూంలో వాడు అందంగా వేలాడదీసిన చెప్పుల్లో నా కులం వాళ్ళు పోగొట్టుకున్న బ్రతుకులే కన్పడుతున్నాయి.

వాడి దగ్గర నుండి వెనుతిరుగుతున్నప్పుడు ''మా బ్రతుకుల్ని మా కిచ్చేయండి'' అని అర్థించాలన్పించింది.

''నా పని పూర్తయ్యేదాకా నువ్వు నా వెంటే ఉండు రత్తయ్య..'' దారి మధ్యలో వాణ్ణి ప్రాధేయపూర్వకంగా అడిగా.

''ఏం చేయబోతున్నావ్ బావా...'' వాడి మనసులో అనేక భావాలు తిరుగుతున్నాయి.

ఆ పదెకరాల స్థలాన్ని బాగుచేయించి వరుసగా పెద్ద షెడ్లు వేయించా. రత్తయ్య నేనూ మద్రాసు వెళ్ళి కావల్సిన సామాన్లన్నీ తెచ్చాం. అందమయిన ప్రహరీ... ఒక పెద్ద చెప్పుల కర్మాగారం అనొచ్చు,

పెద్దగేటు దానిమీద అందమైన వెండి రంగుని అద్దుకున్న అక్షరాలు... ''పామర్తి లెదర్ వర్క్స్''.

అప్పటికీ అర్థం కాలేదు అందరికీ. ప్రతి పత్రికలోనూ పబ్లిసిటీ ఇచ్చాను. మంత్రితో ప్రారంభింపజేసి ఒక జాతరే చేశా. సభలో నేను మాట్లాడుతున్నంత సేపూ గుండె ఆగి ఆగి కొట్టుకుంది.

''మన వాళ్ళ బ్రతుకులన్నీ కుంగిపోయాయి. అందుకని ఇదేదో ఉద్ధరించే కార్యక్రమం కాదు. మనల్ని మనం కూడదీస్కునే ప్రయత్నం ఇది. ఇక్కడ మనందరికీ 'మన' పని దొరుకుతుంది. మన జీవన విధానాన్ని ఆ మూలాధార చక్రాన్ని కాపాడుకునే ప్రయత్నం జరుగుతుంది. చేతితోనే చెప్పులు కుట్టి దాన్ని మార్కెట్ చేసే ప్రయత్నం.

టవున్లో అన్ని హంగులతో పెద్ద షోరూం ప్రారంభిస్తాను. అక్కడ వాటిని అమ్మే కార్యక్రమం జరుగుతుంది. మీ అందరి ఆశీర్వాదం ఉంటే ఈ నా ప్రయత్నం తప్పకుండా విజయం వైపు పయనిస్తుంది...'' వింటున్న వారి కళ్ళలో చెమ్మని గమనించాన్నేను.

హుసేన్ కూడా వచ్చాడు. మిత్రులంతా అభినందించారు.

''సక్సెస్ అవుతుందంటావా రమణ్'' అన్నాడు హుసేన్.

''చూద్దాం ప్రయత్నించడంలో తప్పులేదుగా..''

భగవంతుడు అన్యాయం చేయడనే నమ్మకం నాకుంది. నా జాతి ఆశీర్వాదం నా నెత్తినుంది. సాధిస్తాననే గుండె ధైర్యముంది. ఇంకేం కావాలి. ఇప్పుడు బ్రతుకు తలుపులన్నీ బార్లా తెరుస్తాను. నా వాళ్ళందరినీ అందులోకి ఆహ్వానిస్తాను. దేన్నయితే సాధించడానికి పరాయి దేశంలో అహోరాత్రుళ్ళు ఊడిగం



## కీర్తికి కష్టకాలం...

'బోణీ'తో తెలుగు తెరకు పరిచయమైన కీర్తీ కర్బందా గుర్తుండే ఉంటుంది. ఆ సినిమా విడుదలయిన వెంటనే ఆమెను అందరూ 'జూనియర్ జయప్రద'గా అభివర్ణించారు. ఈ సినిమా తరువాత ఆమెకు అవకాశాలు కుప్పలు తెప్పలుగా వచ్చిపడతాయని అప్పట్లో అందరూ భావించారు. కీర్తి కూడా పాపం అలాగే అనుకుంది. అందరి అంచనాలు తారుమారు చేస్తూ కీర్తీకి ఆ తరువాత సినిమాలే కరవయ్యాయి. దీని వెనుక బోలెడు కారణాలున్నా, నిర్మాతలు మాత్రం ఒకే ఒక్క కారణం చెబుతున్నారు. కీర్తీ పారితోషికం చాలా ఎక్కువట! సినిమాకు 20 లక్షలు డిమాండ్ చేస్తోందట! తాను న్యాయంగానే అడుగుతున్నాననీ, నిర్మాతలే దాన్ని వక్రీకరిస్తున్నారని కీర్తి ఆరోపిస్తోంది. కొందరు తారలకి కోట్లకుకోట్లు రెమ్యునరేషన్ ఇస్తూ, తనలాంటి వర్ధమాన హీరోయిన్‌తో మాత్రం గీసి గీసి బేరాలు ఆడతారని ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఏది ఏమైనా కీర్తీ పారితోషికం మొత్తాన్ని తగ్గించుకుంటేనే ఆమెకు అవకాశాలు వస్తాయని పలువురు అంటున్నారు. అప్పటి వరకూ కీర్తికి కష్టకాలం తప్పదని వారు చెబుతున్నారు.

చేశానో దాన్ని సాధించుకుంటాను.

అమ్మ చనిపోయినప్పుడు కూడా నేను రాలేదు. చెంగునిండా దుఃఖాన్ని తడుపుకుని నెత్తిన కప్పుకున్న అమ్మకి ఏ లోకంలో ఉన్నా నా దళితజాతి బహూకరించిన కిరీటాన్ని అలంకరిస్తాను.

రెండు చేతులు తప్ప ఏమీ లేని నా జాతి దేహానికి తెరచాపని కట్టి నిర్భయంగా సముద్రంలోకి వదులుతాను.

ఆ రాత్రి నా అడుగులు ఒంటరిగా ''పామర్తి లెదర్ వర్క్స్'' ముందు ఆగాయి. ఒక్కడినే లోపలికి వెళ్ళా. అది నా దేవాలయం. నేనూ నా నింగీ, నా చెట్టూ కొమ్మలూ.... నా మట్టి అన్నీ అక్కడేనని నిర్ణయించుకున్నా... నిశ్శబ్దం... అంతా నిశ్శబ్దం.

జిగేలు మని వెలిగిపోతున్నాయి లైట్లన్నీ. వెల్తురు నాతో సంభాషించటం మొదలు పెట్టింది. ఎవరివో నా పూర్వీకుల ఆత్మలు సంతోషంగా తిరుగుతున్నాయి.

ఒంటరిగా నేను... అవును మొదటి అడుగు ఒంటరిదే. నా చేతులు దేనినో వెతుకుతున్నాయి. మిషను లాగా పని చేస్తున్నాయి నా చేతివేళ్ళు.

గోడకు వేలాడుతున్న కమ్మటి తోలుని చేతుల్లోకి తీస్కున్నా.

నేను అందుకున్న ఆకాశపు తోలు మీద నా కుడిపాదాన్ని మోపి కొలతని తీసుకున్నాను. భూమి మీద ఉండిపోయిన నా ఎడమ పాదాన్ని మొదటి దానితో సహవాసం చేయించాను.

దేవాలయం ధ్వజ స్తంభంలాగా నిలబడ్డ 'సిలికారి'ని మేము పోగొట్టుకున్న బొటన వేలితోనూ, చూపుడు వేలి మధ్యనూ బిగించి పట్టుకున్నా. నా రాజ్యాన్ని చేజిక్కించుకోవడానికి రంపెని, కత్తిని చెరో చేత్తో పట్టుకుని సునాయాసంగా ఆకాశాన్ని చీల్చాను. కమ్మటి వాసన...

నా గుండె నరాల దారానికి మైనం అద్దుతూ ఉంటే.. నా జాతి గుండె కోత విన్పడతా ఉంది.

గూటం దెబ్బలకి ఆకాశం నిశ్శబ్దంగా చేతుల్లో ఒదిగిపోయింది. లాసుమీద పెట్టి సదరం జేస్తా ఉంటే... మాదిగ పోటంటే ఇదిరా అంటా ఉంది.

యుగాల నిశ్శబ్దాన్ని చీలుస్తూ ఉంది ఆ శబ్దం.

రంపెతో మరలా చుట్టూరా అందంగా కత్తిరించాను. ఇంకోసారి సిలికారితో దారాన్ని కల్సి సుట్టూరా అందంగా తూట్లు పొడిచి...

నా కళ్ళకి అద్దుకున్నాను. ఆకాశం నవ్వింది. ఏడ్చింది. నన్ను నమ్మింది. నా కలల ప్రపంచంలో నేనే మొదటి పనివాణ్ణి. నాకు పని దొరికింది. పని చేశాను.

ఎప్పటి నుంచి గమనిస్తున్నారో తెలీదు... సింద్రిల్లా, రెయినీ ఇద్దరూ ''నాన్నా నీకు ఇదంతా చేతనవునా..?''

''పుట్టిన కులం పని తెలియక పోవడం అంటే వాడు మాటలు నేర్చిన మూగవాడితో సమానం తల్లీ... మనం మాదిగోళ్ళమమ్మా. మనం చెప్పులు కుట్టుకుని బతికేవాళ్ళం. ఇందులో సిగ్గుపడాల్సిన పని లేదు. మనం దొంగలం కాదు. పని చేసుకు బతికే వాళ్ళం. మనమే నిజమయిన మనుషులం...''

నా బిడ్డలు ఏడుస్తూ నన్ను కుదిపేశారు.

ఇల్లు చేరుకున్నాను. బహుశా అర్ధరాత్రి దాటింది. వాకిట్లో నిద్రపోతున్నాడు మా నాన్న.

కొన్ని వేల చెప్పులు కుట్టిన మా నాన్న ఎప్పుడూ చెప్పులు తొడగలేదు.

మా అయ్య నగ్నపాదాలకు చెప్పుల్ని తొడిగాను. గభాల్న లేశాడు నాయన. కాళ్ళనుంచి చెప్పుల్ని దించి కళ్ళదగ్గరికి చేర్చుకున్నాడు.

మా నాయన జాతీయ పతాకాన్ని గుండె కెత్తుకున్నంత గర్వంగా ప్రేమతో చెప్పుల్ని గుండెకి హత్తుకున్నాడు. కడవ నెత్తికెత్తుకున్నట్లు నెత్తినెత్తుకుని చిందేస్తూ ఊగిపోయాడు. గులాబీని వాసన పీల్చిన ప్రేమికునికి మల్లే గట్టిగా తోలు వాసన్ని మొత్తం గాఢంగా ఊపిరితిత్తుల నిండా నింపుకున్నాడు.

నేను కుట్టిన చెప్పుల సొగసుతనాన్ని చూసి బోసి నవ్వుల పిల్లాడిలాగ అయిపోయాడు. మా ఇరువురి మధ్యన కూలిన వారధిని చెప్పులతో కట్టాడు! మరలా మా నాయన. సముద్రపు అలల శబ్దాన్ని కలగన్నాడు.

నా కుడిచేతిని పట్టుకుని వీధిలోకి లాక్కొచ్చాడు. అరుగు మీద యాపచెట్టు కింద చెప్పుల్ని ఉంచి గబగబా లోపలికి పరిగెత్తాడు.

వస్తా వస్తా లోపల్నించి భుజానికి తప్పెట తగిలించుకు వచ్చాడు.

కణా... కణా... తప్పెట గుండె కొట్టుకుంటూ ఉంది.

బొడ్డులో దోపుకొచ్చిన పుల్లలు డప్పు గుండె మీద లయబద్ధంగా కదల్తా ఉండాయి. సొగసుగా ఆడతా ఉండాయి మా నాయన కాళ్ళు. వాడకి జీవమొచ్చింది....

ఒకటి ... రెండు.. మూడు...

నిద్దరపోతున్న పలకలన్నీ ఒక్కొక్కటి ఇళ్ళలోంచి దుమ్ముర్రేపుకుంటా గుండెలు బాదుకుంటా వస్తా ఉండాయి.

మా నాయన డప్పుకి హోర్టుదియా. దానితో అర్ధరాత్రి సరసం స్టార్టుకియా.

''ఎయ్‌రా నర్సిగా... దీనెమ్మ... దీనెక్క....'' డప్పులు లయగలపతా ఉండాయి. పలకలు పలకతా ఉండాయి... నిద్రపోతున్న ప్రపంచాన్ని లేపడానికి.

ఇప్పుడు సజీవంగా మోగుతున్న పలకలన్నీ ఇంతకాలం అంతః ప్రవాహాలుగా ఎక్కడ దాగి ఉన్నాయో అర్థం కాలేదు.

ఊపిరి పోయినా ఫర్వాలేదని పలకతా ఉండాయి డప్పులు.

భోరున వాన... వర్షం... బర్సాత్... రెయిన్...

భూమి తల్లి హృదయం ద్రవించింది. నన్ను పూర్తిగా పవిత్ర పర్చింది. వాడ మేల్కొంది.... ఊరు మేల్కొంది. ఎప్పుడూ కన్నీళ్ళు కార్చని నా భార్య రోదిస్తోంది.

మా నాయన పలక పక్కన పెట్టి అమాంతం నన్ను ఎత్తుకున్నాడు. ఒక్క చర్నాకోల దెబ్బ పడింది గుండెమీద.

తడస్తా ఉండాం అందరం వానలో. నేను నా జాతి అంతరంగాన్ని చూస్తున్నాను.

ఈ రాత్రి నేనూ నిప్పుని ఆన్చిన తప్పెటతో చిందేసి ఆడతాను ఊగుతాను. నా జాతి పాట పాడతాను. సమస్త హృదయాల్ని కన్నీళ్ళతో అభిషేకించుకుంటాను. ఈ రోజు నా పరవశానికి అనకట్టని కట్టడం అసాధ్యం.

నా జాతి ఆక్రందనని ఆనందంగా మలుస్తాను.

అవును... నేను రవిణిగాడిని. నరసయ్యా, రాములమ్మల కొడుకుని. నా పేరు మాదిగోళ్ళ రవణడు. పామర్తి రవణుడు.

నా తల తడిసినాకే నేను సజీవుడినయినా.

*

కవిత

## మనసు జలదరించిన వేళ...



మళ్లీ ఇన్నాళ్ల తరవాత
మనసు చెలమలో మంచినీళ్లు ఊరడం మొదలెట్టాయి.
బిందెలు నింపుకొని వెళ్లడానికి
పల్లె పడుచులెవ్వరూ రావడం లేదు
తడి ఇసుకలో పిచ్చుక గూళ్లెవరూ కట్టడం లేదు.
ఛెళ్లున చిమ్మే గోరింటాకు దోసిళ్ల చేతులు
ఘల్లున మోగే మట్టిగాజుల మోతల కోసం
ఏటిలోని నిశ్శబ్దం ఎదురు చూస్తోంది.
ఇంటికెళ్లే కాలిబాట ఎక్కడుందో తెలియడం లేదు
ఇసుకలో ఎంత వెతికినా జ్ఞాపకాల గవ్వలు దొరకడం లేదు.
పలచటి నీటి పాయల అంచులమీద
పక్కచేప పిల్లలు 'హైకూ'ల్లా కదులుతున్నాయి.
చిన్నప్పుడు స్నేహితులతో కలసి నవ్విన చప్పుడు
నిలవ నీళ్లలో బెకబెకమని వినిపిస్తోంది.
ఒడ్డున నిలబడ్డ ఒంటరి నేస్తాలు
జంటమామిడి చెట్లు.. జాడలేవు..
తొలి యౌవనపు ప్రణయంలా పరుగెత్తిన సెలయేరు
ప్రేయసిలాగానే అత్తింటికెళ్లి ఎండిపోయింది..
ఇసుక మధ్య నుంచి ఏకాంతంగా చూస్తుంటే
గతమంతా మసక చీకటిలా కనిపిస్తోంది..
ఊరు వలస పోయిందని ఏరు,
ఏరు మాయమైందని ఊరు,
ప్రక్క ప్రక్క నిలుచున్న అపరిచితుల్లా మౌనంగా ఉన్నాయి!
రెండింటిని ఎరిగిన నేను
రెక్కల కందని దూరాన్ని స్వప్నించే పక్షిలా మిగిలాను!
మనసు జలదరించగానే మేలుకున్నాను!

– డా.రాళ్లబండి కవితాప్రసాద్